
# మబ్బు విచ్చింది



మోయలేని వెన్నెల చలువలతో కనుమోడ్చింది. ప్రకృతి నిర్భర ప్రశాంత మధురిమ హృదయంలో నిక్షిప్తం చేసుకుని పరవశత్వంతో సొలిపోయింది యామిని. నీరవమూ, నిస్తబ్ధమూ అయిన వాతావరణంలో విడవకుండా వినవచ్చేది నిశీధి నిశ్శబ్ద మొక్కటే!

బయట వీథంతా కలయచూస్తూ, ఎటు వేపునించి భర్త వస్తున్నాడో అని వెతుకుతున్న లలిత కళ్లల్లో అప్రయత్నంగా అశ్రువు లూడినయ్యి. ఎప్పటికప్పుడింతే. ఇంట్లో చెప్పి పెట్టకుండా, ఎవరో ఫ్రెండ్‌తో పడిపోయి ఏ అర్ధరాత్రి వేళనో తిరిగి వస్తాడు! అదేమిటని తనడగలేదు. అంతకంటే తన కోపం అంటే లక్ష్యంలేనట్లుగా, భార్య తన కోసం ఎదురుచూస్తూ ఉంటుందనైనా లేకుండా తన వేళకే వస్తాడతను! ఈమౌనంలో, ముభావంలో అతని హృదయం అర్థంకాక తనెంత కుమిలిపోతోందో అతనికి తోచదు. పోనీ, అతనికి తనపై ప్రేమ లేదనుకుందామంటే, కాగడా పెట్టి వెతికినా కారణాలు కనిపించవు తనకి!

....కిటికీలో కూర్చుని భర్తకోసం ఎదురు తెన్నులుచూస్తున్న లలిత మస్తిష్కంలో ఎన్నెన్నో ఆలోచనలు యథేచ్ఛా విహారం చేస్తున్నాయి. భర్తనీ, అతని ప్రవర్తనని గురించి ఆలోచించిన కొద్దీ అతనికి తనపై ప్రేమ లేదేమోననే ఆశంక అధికమై, ఆ ఊహలోని దారుణాఘాతాన్ని భరించలేక నిశ్శబ్దంగా ఏడుస్తూ కూర్చుంది లలిత.

ప్రతిమా దేవి

హఠాత్తుగా వీధి చివర మోటార్ సైకిల్ చప్పుడు వినిపించింది. లలిత అప్రయత్నంగా కళ్లుతుడుచుకుని అటు వేపుచూస్తూ నిరీక్షించింది.

మోటార్ సైకిల్ వచ్చి గేటుముందాగింది. దానిమీద కూర్చున్న వాసు 'పన్నెండయింది. నీ భార్యకేమని జవాబు చెప్పుకుంటావు? సమాధానం సరిగ్గాలేకపోతే ఆవిడకు కోపం రాగలదు. జాగ్రత్త! పాపం! వెన్నెల రాత్రికూడా' అంటున్నాడు నవ్వుతూ.

'నాభార్యకి కోపం రాదు లేవోయ్‌రాజా! వస్తా! నువ్వు వెళ్లుమరి! వెన్నెల రాత్రి!!' అని భావగర్భితంగా పరిహాసమాడుతూ కృష్ణ లోపలికి రావటం చూసింది లలిత.



స్నేహితుడికి భర్త ఇచ్చిన సమాధానం విన్న లలితకి కోపంవచ్చింది. తనకి కోపం రాదుట! కోపం లేదు కనుక నేనా ఇలా వేపుక తినటం? అందరిలా తనూ కోపతాపాలు కల దవుతే. ఆయన వేళ కింటికివస్తూ, వేళకి తింటూ లక్షణంగా ఉండేవా డన్నమాటేగా.

'ఇలాగే మనుషుల్లో మంచి దక్క నివ్వరీ మనుషులు!' అనుకుంది లలిత కోపంగా.

'లలితా' — బయటినుంచి భర్త తలుపు తట్టాడు.

లలితకు వెంటనే పలకా లనిపించ లేదు. ఎప్పుడూ అతనొచ్చేసరికి, తట్టిన వెంటనే తలుపు తీస్తూవుంటే అబ్బాయి గారి ఆటలు రోజురోజుకీ శ్రుతిమించు తున్నాయి. ఇవాళ ఏమైనాసరే అత నికి 'రోజూ ఇలా ఆలస్యంగా రావటం పొరపాటు చేస్తున్నాను!' అనిపిం చేట్లు చేయాలి. చాలసేపటిదాకా తలుపు తీయకూడదు. అనుకుందామె.

'లలితా'— మళ్ళీ తలుపు తట్టిన చప్పుడు.

'వస్తున్నా!' .... అప్రయత్నంగా నోరుజారింది. లలిత వెంటనే తన తొందరపాటుకి తిట్టుకుంది. కాని తప్పేదిలేక వెళ్ళి తలుపు తీసింది.

'ఎంతపిలిచినా పలకవేం? నిద్ర పోతున్నావా' అన్నాడు కృష్ణ లోప లికి వస్తూ.

'ఊఁ' అంది లలిత బద్ధకంగా. కాని మనసులో మాత్రం 'మీవంటి భర్త లుంటే నిద్రేంకర్మ? ఎప్పుడూ ఒక్కటే నిద్ర!' అనాలని గాఢంగా వాంఛిం చింది. అనలేని ఆశక్తత లోలోపల గుండెల్లో మూలిగింది.

'త్వరగా అన్నంపెట్టెయ్! అబ్బ! నిద్ర ముంచుకొస్తోంది!' అన్నాడు కృష్ణ. ఆమె అందించిన లుంగీ కట్టు కుంటూ.

లలితకు లోలోపల ఉవ్వెత్తున కోపమూ, దుఃఖమూ పొంగాయి. బయటికివెళ్తే ఇల్లు గుర్తు రాదు. నిద్రాహారాలమాట మరచిపోతాడు. ఇంటికివచ్చేసరికి ఈ హడావుడంతా. తనతో ఒక్కక్షణం మాట్లాడేపాటి తీరికా, ఓపికా రెండూ కరువై పోతాయి పాపం మానవుడికి!

లలిత కోపం దిగమింగుకుంటూ మాట్లాడకుండా భర్తకి అన్నం వడ్డిం చింది.

అతను తినటం పూర్తిఅయి, అవక ముందే ఎక్కడివక్కడే ఉంచేసి గబ గబా ముసుగుతన్ని పడుకుంది.

భార్యలో రేగే తుఫాను ఏవిధ మైనదో, అసలొక తుఫానామెలో రేగుతోందేమోననే ఆశంక లేకుండా,

హాయిగా నిర్మలమైన మనసుతో నిద్రకి పడ్డాడు కృష్ణ.


* * *

పొద్దున్నే కాఫీ లవీ అయ్యాక, స్నానంచేసి వంటకి ఉపక్రమించబోతూ ఉండగా 'ఇప్పుడే వచ్చేస్తాను లలితా తలుపేసుకో!' అంటూ ఫుల్ డ్రెస్‌లో కృష్ణ గబగబా వెళ్లిపోయాడు.

బాయిలర్‌లో నిప్పు కుంపట్లోకి తీసుకుందామని గరిటపట్టుకు వస్తున్న లలిత అలాగే నుంచుని భర్త మాటలు విన్నది. 'అవును! కాదు' అనలేదు. అనలేమైనా అనే వ్యవధి మాత్రంఏది?

రాత్రినుంచీ భర్త ప్రవర్తనపట్ల నిరసన ప్రకటిస్తున్న లలిత మనసీ సంఘటనతో పూర్తిగావిరక్తి చెందిపోయింది. పొద్దుటినుంచీ తనకోపం గుర్తించాలని ఆమెచేసిన ప్రయత్నాలన్నీ అతని ముందు వ్యర్థమై పోయాయి. ఒకసారి కాకపోతే, మరొకసారైనా 'కోపమెందుకు?' అని లాలించకపోతేపోయె! 'పిలిస్తే పలకవేల?' అని కోపగించుకోనుకూడా కోపగించుకోడేమిటి? లేకపోతే 'దీని కోపం నాకో లెక్కా?' అని నిర్లక్ష్యమా? ఏమిటతని భావం?

దెబ్బతిన్న అభిమానంతో దీనంగా వంట ప్రారంభించింది లలిత. చూడగా చూడగా ఆమెను తనసుఖమంతా ఈ వంటపెట్టులోనే పరిమితమైనట్లు తోచ



సాగింది. తను ఏంచేస్తున్నది. ఎలా ఉంటున్నది. తన మనసేమిటి? ఇలాటివేమీ భర్తకి పట్టవు. వండిపెట్టటం తన వంతు! ఎప్పుడో తనవేళకి వచ్చి నాలుగు మెతుకులు కొరికి పోవటం అతనివంతు! ఈలోగాతను ఇంట్లో ఎలా బాధపడ్డానరే!!

ఏ సుఖమూ లేకుండా, తనకీవండి పెట్టటం ఒక్కటే దక్కిందనుకునే సరికి లలిత హృదయం రోషంతో చెలరేగింది. తనూచదువుకున్నది. తనకూ ఒక మనసంటూ ఉన్నది. ఎదుటివాళ్లు ఆడించినట్లల్లా ఆడటానికి తనేం వాళ్ళచేతిలో కీలుబొమ్మకాదు. తననొక దాసీదానికింద పరిగణించదలచుకుంటే, వాళ్లైవ

రైనా, ఆఖరికి తన భర్త అయినా లక్ష్యంచేయదు తను!

ఇన్నాళ్ళబట్టీ చూస్తోంది. ఒక్క నాడైనా ఇంటికి వేళపట్టున వచ్చి, ఒక్కక్షణం తనతో తీరిగ్గా మాట్లాడిన నిమిషంలేదు. ఎంతసేపు తన సిని మాలు, స్నేహితులు, సరదాలు! ఇంట్లో భార్యగతేమిటన్న ఆలోచనే లేదు!

అలా అయినా తను సహిస్తూనే వచ్చింది. అతను ఒక్తి సరదామనిషి! తనువచ్చి అతని ఉత్సహం పాడు చెయ్యట మెందుకనుకుంది. కాని ఎంతకని తన ఓర్పు? ఎప్పుడూ ఊరి వెంటపడి తిరగటమే! ఎప్పుడూ సర దాలే! అంతుం డక్కర్లేదూ? అర్ధ రాత్రులూ, అపరాత్రులూ, ఒంటరిగా అతని కోసం కనిపెట్టు కూర్చుంటుంది తను. కాని ఒక్కనాడైనా 'నాకోసం ఇంతసేపు మేలుకున్నావా?' అనే కృతజ్ఞతా వాక్యానికైనా అతనినుంచి నోచుకోలేదూ తను?

....ఆలోచనల ఆవేశంలో కుంపటి విసరటం వేగం హెచ్చయింది. కుం పట్లో నిప్పులాగే ఆమె హృదయమూ బాధతో రగులుతోంది.

పోనీ! భర్తకి తనపై ప్రేమ లేదనుకుందామంటే అందుకూ ఆస్కా రం కనిపించదు. తనంటే ఎంతో గౌరవిస్తాడు. ప్రేమగా, నవ్వుతూ మాట్లాడతాడు. ఎప్పుడూ పల్లెత్తు మాట అనడు. అంతవరకెందుకు? రోజూ అలవాటుగా తనుచేసే పనుల్లో ఏది మరచిపోయినా, ఎక్కడ పొర పాటువచ్చినా 'ఇదేమిటి?' అని మంద లించినట్లే, బుద్ధిపూర్వకంగా తను ఏదైనా పనిచేయకపోతే తనకి కోపం వచ్చి ఆ పని మానేసిం దేమోననీ గుర్తించడతను. తనకి కోపం లేదని అతని ఊహ. కాని కోపంలేని భార్యకి బాధా బహుకృతి??

అతని తత్త్వమేమిటో లలిత కెంత ఆలోచించినా అంతుపట్టలేదు. ఎప్పుడు తన నతడు కోపించనట్లే, ఏ పరిస్థితి లోనూ తన అవసరాలేమిటో అడగ లేదు.

ఆలోచించగా, ఆలోచించగా లలిత భర్తకి తనపై ప్రేమ ఉందని సంతృప్తి పొందలేనట్లే, లేదని నిర్ధారించనూ లేకపోయింది.

ఏమైనాసరే? ఇవాళ అత నింటికి వచ్చేయగానే 'ఏమిటిది? ఏమిటి మీ భావం?' అని నిలదీసి అడగాలి. 'నేనేం ఇక్కడ తేరగా దాసీపనికి రాలేదు.' అని స్పష్టంగా చెప్పాలి. తనకి కోపం రాదుట, తనమెతక తనంచూసే అతని కంత అలుసు. తనకీ కోపం ఉందని, తనకీ భావాలు, ఉద్దేశాలు ఉన్నాయని,

తనేం ఫీలింగ్సు చచ్చిన మనిషికాదని అతని కర్థమయ్యేవిధంగా గట్టిగా చెప్పి తీరాలి. అని మనసులో నిర్ధారించుకుంటూ కూరదింపి అన్నానికి పెట్టింది లలిత.

....వంట అయిపోయింది. ఇవాలేమిటో? కుంపటితోపాటు తన మనసూ రాజుకుని రగిలిపోతోంది. అభిమానంతో రెచ్చిపోతోంది. బాధతో కుమిలిపోతోంది.

నిజంగా ఇదంతా భర్తకి తనపై గల నిర్లక్ష్యమేనా?

లలితకీ ఊహతో తను, తనవిలువ, విద్యాధికత అన్నీ ఒక్కసారి తలపుకి వచ్చి 'అవకాశముంటే ఇంతకంటే గొప్పదాన్నే అయేదాన్ని. ఒకరి దయాధర్మ భిక్షకిలా ఎదురుచూస్తూ బతికే కర్మ నాకు పట్టేదేకాదు. అమ్మా, నాన్నా నాకు పెళ్లెందుకు చేశారు? ఈ పొయ్యిదగ్గర ఇలా పడిఉండలేక పోతానా?' అనిపించేసరికి పట్టరాని దుఃఖం పొంగివచ్చింది. ఏడుస్తూనే వెళ్ళి మంచంమీద పడుకుని ఆలోచించ సాగిందామె. ఆలోచనలు సాగనిచ్చిన కొద్దీ వ్యథ ద్విగుణీకృతమైందామెలో.

అలా ఎంతసేపు విచారించిందో,— కొంచెంగా కూఉకు పట్టబోతూ ఉండగా టెలిఫోన్ మోగసాగింది.



"ఛీ! ఈ పాడు కొంపలో ఒక్క క్షణముండను! ఇప్పుడేపోయి ఏ నూతిలోనన్నా దూకి చస్తా!"

"ఓ! నిక్షేపంగా దూకు పోండి! దూకినా నీళ్ళలో మునిగేటంత బరువుంటే కదూ! మీరు తేలే వుంటారు!"

లలిత విసుక్కుంటూ లేచి రిసీవర్ అందుకుంది.

'హలో! లలితా?'

లలిత ఆశ్చర్యపోయింది. ఆ మాట్లాడేది తన భర్తే! తననుకున్నట్లు ఫ్రెండు కాదు.

'హలో! లలితా.'

....భర్త ఎదురుగుండా ఉన్నట్లుగానే కోపంగా పెదవులు బిగించి 'ఏమిటి?' అని అడిగింది లలిత.

'చూడు. నాగదిలో టేబిల్ మీద పచ్చట్ట ఫైలుంది. రంగనాథన్ వస్తున్నాడు. అతనికిచ్చి పంపించు.'

లలిత జవాబు చెప్పటానికి కాస్సే పాగింది.

'ఏం ? పంపిస్తావా ?'

'ఎక్కడినుంచి ఫోనుచేస్తున్నారు?' పట్టలేక కఠినంగా అడిగింది లలిత.

'సారీ. ఆసంగతి చెప్పటం మరచి పోయాను. ఆఫీసునుంచే మాట్లాడు తున్నాను. నా ఫ్రెండ్ వాసులేడూ ? వాడితో పొద్దున వాళ్ళ బంధువుల యింటికి వెళ్లాను. వాడితోపాటు నన్నుకూడా భోజనం చేయమని బల వతంపెట్టారు వాళ్ళు. తప్పించుకో లేకపోయాను. కబుర్లలో అక్కడే టైమయిపోయింది. వాసు మోటార్ సైకిల్‌మీద ఆఫీసులో దించేసి వెళ్లాడు నన్ను. ఆ ఫైలు పంపిస్తావా ? పచ్చ ట్టది. బల్లమీదఉంది....నువ్వు భోజనం చేసావా ?—' అంటూనే కృష్ణ రిసీ వర్ పెట్టేసాడు.

లలిత నిశ్చేష్టురాలైంది. ఆమెకీ సంఘటన నెలా తీసుకోవాలో అర్థం కాలేదు. మాటవరస కన్నట్లు చివరికి భర్తచేసిన పరామర్శకి సంతోషిం చాలో, బాధపడాలో తెలియలేదు. ఇక్కడ తను వంటచేసి అతనికోసం ఎదురు చూస్తోంది. అక్కడ అతను హాయిగా భోజనంచేసి ఆఫీసుకి కూడా వెళ్లిపోయాడు. పైగా ఫైలు పంపా లిట ! ఇంతబాధ్యత పట్టని మనుషులకు పెళ్ళికూడా ఎందుకు? వీళ్ళ నిర్ల క్ష్యమూ, ఉపేక్షా భార్య లనుభవించక పోతారనేకాని !

—వాకిలి తలుపు చప్పుడైంది.

విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది లలిత.

రంగనాథన్ ఒగరుస్తూ నుంచుని ఉన్నాడు.

"అయ్యగారు ఫైలు తెమ్మన్నా రండీ!" అన్నాడు వినయంగా.

లలిత కోపం దాచుకుని వెగటుగా నవ్వుతూ "నీకూపనిలేదు. మీ అయ్య గారి కంతకంటే పనిలేదు. ఊరువెంట తిరగటం ఆయనపని ! ఫైళ్ళందివ్వటం నీపని ! ఇంద పట్టికెళ్ల !" అంటూ ఫైలందించింది.

రంగనాథన్ కృతజ్ఞతా భావంతో నవ్వుతూ 'అలా అనకండమ్మా! అయ్య గారు లేకపోతే ఈ పాటికి నేనెక్క డుండేవాడ్నో ఆ భగవంతుడికి తెలుసు. ఆయన ఎరుగని వాళ్ళంటూలేరండి.' అని ఫైలు తీసుకుని సైకిల్‌మీద పరుగెత్తాడు.

అతను వెళ్ళాక ఆమె ఆలోచిస్తూ నుంచుంది. అవును. ఆయన ఎరుగని వాళ్లులేరు. ఉన్నా బతికిపోయేదితను! ఇప్పుడెటూ కాకుండా పోయింది తన బ్రతుకు!!

కలగిన మనసుతో నాలుగు మెతుకులు కొరికి నిద్రకిపడింది లలిత !

*   *   *

సాయంకాలం ఆఫీసునుంచి రావటమే 'లలితా ఇవాళ ఆంధ్రాక్లబ్‌లో పార్టీఉంది తయారవు తర్వగా' అని హడావుడిచేస్తూ వచ్చాడు కృష్ణ.

ఫ్లాస్కులో కాఫీ కప్పులోపోస్తూ 'నేనెందుకు ?' అంది ముభావంగా లలిత.

'నే నెందు కేమిటి ? నువ్వుకాక నా వెంట రాతగిన వారెవరు భామా ?' అంటూ ఉషారుగా కాఫీ తాగసాగాడు కృష్ణ.

లలిత అతనికి జవాబు చెప్పలేదు. మధ్యాహ్నం భర్త చేసిన పొరపాటుకి రాగానే క్షమాపణ కోరకపోవటం ఆమె కతనిపై కోపాన్ని ద్విగుణీకృతంచేసింది.

కాని కృష్ణ అసలాసంగతే మరచిపోయాడు.

మాట్లాడకుండా ఫ్లాస్కు తీసుకుని వెళ్లిపోయిన భార్య ముస్తాబు కావటానికే వెళ్లిందనుకుని తృప్తిగా కృష్ణ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

కాని అతని ఈ ఊహకి విరుద్ధంగా, గదిలోకి వచ్చి చూసేసరికి లలిత మంచానికి చివర, కాళ్లూ మూతీ



రెండూ ముడుచుకుని ముభావంగా కూర్చుని ఉంది.

కృష్ణ ఆశ్చర్య పోయాడు.

'ఇదేమిటి? ఇంకా ఇలాగే కూర్చున్నా వేం?' అని అడిగాడతను.

లలిత మాట్లాడలేదు.

కృష్ణ మనసుకొద్దిగా నొచ్చుకున్నది.

'బట్టలివ్వవూ లలితా?' అని అడిగాడతను లాలనగా.

లలిత మాట్లాడకూడదు; కదలకూడదు. అనుకున్నది. కాని అతని కంఠంలోని లాలన ఆమెలో దేనినోసంచలింప చేస్తోంది. కరగిస్తోంది...మౌనంగా లేచి బట్టలుతీసి భర్తకిచ్చి వెళ్లిపోసాగిందామె.

కృష్ణ ఆమె నాపేసాడు.

'నువ్వు రావూ?'

'ఉహుఁ.'

బలవంతంగా తప్పించుకుని వెళ్ళి పోయిన భార్య వేపు దిగాలపడి చూసా డతను. తర్వాత ఏమనుకున్నాడో ఏమో డ్రెస్ చేసుకుని ఆమె ఉన్నగది దగ్గరకువచ్చి 'ఒంట్లో బాగాలేదా లలితా?' అని అడిగాడు మృదువుగా.

'బాగానేఉంది.'

'మరెందుకు రానంటున్నావు?'

లలితలో పట్టుసడలిపోతోంది. ఈ వ్యక్తికా తనమీద ప్రేమలేదను కొం టోంది తను !!

'ఏంలేదు. మీరువెళ్లిరండి.' అం దామె మెల్లిగా.

భార్య ముభావానికి కారణం తెలుసుకోలేని కృష్ణ ఇక చేసేది లేక మెల్లిగా అక్కడినుంచి వెళ్లిపోయాడు.

* * *

'లలితా మొన్న డబ్బు అడిగావు కదూ? ఇంద.చాలా? ఇంకాకావాలా?' అని అడిగాడు కృష్ణ పర్సులోంచి నోట్లు పైకితీస్తూ.

అతనిమాటలు విన్న లలిత మొహం విప్పారలేదు. చెయ్యిజాపి డబ్బుతీసు కోనూ లేదు.

'ఇంద లలితా' చాలా ? కావా లంటే ఇంకాఇస్తాను !' అన్నాడతను మళ్ళీ.

'అసలేమీ ఒద్దు !' అంది లలిత.

'అదేమిటి ? ఎందుకనీ ?' – కృష్ణ భార్యవేపు ఆశ్చర్యంగా చూశాడు. 'మొన్న యాభై చాలన్నావని అంతే ఇవ్వబోయాను. ఇంకా కావాలంటే తీసుకో. నీ యిష్టం. ఇంద !'

పర్సు ముందుకి జూపుతున్న భర్తని చూసి అతని ఆలోచన లంతకంటే ముందుకి పోలేక పోయినందుకు విచా రించింది లలిత. తను అత నిచ్చేదిచాలక నిరసిస్తోందా ? ఏంమనిషి !!

'ఊఁ. ఇంధ; తీసుకోవేం ?'

'అక్కర్లేదు. అవసరం తప్పి పోయింది ?'

'అంటే ?'

....లలిత మాట్లాడకుండా వెళ్ళి రేడియోట్యూన్ చేయసాగింది.

'లలితా.'

భర్త కంఠంలో విసుగు లలిత కోపాన్ని రెచ్చగొట్టింది.

ఆమె గిరుక్కున అతనివేపుకి తిరిగి 'ఆనా డడిగితే లేదన్నారు. ఆ అవస రం ఇవ్వాళలేదు. అందువల్ల అక్క ర్లేదు. ఇంక ఆక్టే తలచకండి !' అంది కోపంగా.

మొదటిసారిగా భార్య ప్రవర్తనకి బాధపడ్డాడు కృష్ణ.

'అదేమిటి లలితా. అన్నాడు,....' మాట మధ్యలోనే అందుకుని

'అవును. నేనడిగితే లేనిడబ్బు శేఖరం కోసం అక్షయపాత్రలోలాగా పుట్టుకు వచ్చింది!' అంది అవహేళనగా.

'కాదు లలితా! అతని కివాళ 'డబ్బిస్తాను రమ్మన్నా'ను. నీకైతే ఎలాగైనా నచ్చచెప్పగలను. అతను పరాయివాడు. మనమిచ్చే పాతికకూ, పరకకూ తిప్పితే బాగుంటుందా?'

'అవునుమరి! పరాయివాళ్ళ విషయంలో ఆ మెళుకువలు లేకపోతే పేరెలా వస్తుంది? భార్యనైతే దబాయించవచ్చుకాని! అయినా శేఖరానికి మీరేం ఋణపడి ఉన్నారా.'

'ఋణపడటం కాదు లలితా! పాపం అతనిప్పుడు కొంచెం చిక్కుల్లో ఉన్నాడు. స్నేహితుడ్ని కనుక,....'

రేడియో ఆపేసి పూర్తిగా అతని వేపుకితిరిగి 'మిమ్మల్ని నేనేం సంజాయిషీ అడగటంలేదు. నాకు అవసరం లేదిప్పుడు. ఒద్దంటున్నాను. దీనికి మీ రెందుకంత బాధపడతారు?' అందామె.

'నాకు బాధకాదు. నువ్వు—'

లలిత వెంటనే ఆవేశంతో 'అవును. మీకు బాధలేదుగా. ఇంకెందుకనవసరంగా ఈ విషయం తరచటం? బాధ ఉంటే నాకుంటుంది. నేను పడతాను. మీకెందుకు?' అంటూ గబగబా అక్కడినుంచి వెళ్లిపోయింది.



"నీతో లేచిపోవటానికి నా దగ్గర డబ్బులేదే."
"అయితే ఒకపని చేద్దాం: నీతో వచ్చేస్తాను. నేను కనబడకపోతే మా నాన్న నన్ను పట్టిచ్చిన వాళ్ళకు బహుమాన మిస్తానంటాడు. నన్ను పట్టివ్వు. తర్వాత ఆ డబ్బుతో మళ్ళీ లేచిపోదాం."

భార్యలో ఎన్నడూ కనిపించని ఈ ప్రవర్తనారీతి కృష్ణకెంతో బాధ కలిగించింది. బైటికి తీసిన నోట్లు పర్సులో కుక్కేసి అతను ఆలోచనాపూర్వకంగా అడుగులు వేస్తూ బజారుకేసి నడిచాడు.

* * *

కొన్నాళ్ళనుంచీ లలిత కుమనసులో ఒకటే విషయం మధనమవుతోంది. ఆమెకి భర్త ప్రవర్తన ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. అలాఅని అతనిలో తప్పేమిటో ఇదమిత్థం అని

నిర్ణయించి చెప్పలేకుండా ఉందామె. ఈ బాధతో ఆమె మునుపటిలా సంతోషంతో, ఉత్సాహంగా మాట్లాడ లేకపోతోంది భర్తతో.

భార్యలో స్పష్టంగా కనిపిస్తున్న ఈ మార్పు చూసి 'అలా ఉంటున్నా వేం లలితా? ఒంట్లో బాగుండటం లేదా?' అని అడిగాడొకనాడు కృష్ణ.

'బాగానేఉంది!' అంది లలిత.

'మరి అలా ఉంటున్నావేం?'

ఎన్నాళ్ళనుంచో మనసులో మగ్గి పోతున్న బాధ ఇవాళ భర్త లాలనతో ఒక్కసారిగా ఉప్పొంగింది లలితకు. ఉవ్వెత్తున పొంగే కన్నీటిని నిగ్రహించుకుంటూ తల పక్కకి తిప్పుకుని మోకాళ్లమీద రెండుచేతులూ ఆనించి కూర్చుందామె.

'దిగులుగా ఉందా? మీ అన్నయ్యని చూసివస్తావా?' అని అడిగాడు కృష్ణ ఏమీతోచక.

'ఉఁ.' అని మాత్రం అనగలిగింది లలిత.

ఆమెకీ వాతావరణంలోంచి ఒక్క రోజు, ఒక్క నిమిషం తప్పించుకో గలిగినా చాలనిపిస్తోంది. ఇక్కడ తన మనసుకి విశ్రాంతిలేదు. తన బ్రతుకు వివాహ పరమార్థాన్ని స్పృశించలేక పోయింది. తమ సాహచర్యం అతీత మైనదికాక అతిసామాన్య పంథాలోకి జారిపోయింది. తనకిక ఏ ఆశా లేదు. తను వివాహంలో ఊహించిన ఆశలు, ఔన్నత్యాలు ఫలించకపోగా, రూపు దాల్చకపోగా ఈ వివాహం తన మన శ్శాంతిని సహితం మింగివేసింది. తన కిక బ్రతికి ఎందుకు? తన బ్రతు కెలాగూ ఇలా వెళ్ళి మారవలసిందే!

దుర్భర నిరాశాభరంలో లలిత కళ్ళవెంట జలజలా నీళ్లు రాలి పోయాయి.

భార్య ఏడవటం చూసి హడలి పోయాడు కృష్ణ.

'అదేమిటి? ఏడుస్తున్నావా?'

తలబాగా కిందికి దించేసుకుని గబ గబా కళ్లుతుడుచుకుంది లలిత. మాట్లాడకుండా, జాలిగా తన వేపు చూసేభర్తని చూస్తే బాధకలిగిందా మెకు. ఆమెకీవేళ ఒకవిధంగా జాలి గానూఉంది. మరొకవిధంగా బాధ తోస్తోంది. తను ఏడిస్తే సహించలేని భర్త ఒక వేపు తనఏడుపుకి తనే ఓదార్పు చెప్పుకోవలసిన తన పరిస్థితి మరొక వేపు.

లలితకి భర్తమీద జాలితోపాటు విరక్తి పెరిగింది.

....ఆనాడు సాయంకాలం అతను ఇంటికి రాగానే 'అన్నయ్యదగ్గరకు వెళ్తాను!' అంది లలిత.


'అలాగే!' అన్నాడతను.

'మూడు నెలలుండి వస్తాను.' అందామె భర్త ముఖంలో భావాలు చదువుతూ.

'మూడుకాదు. ఆరు నెలలుండు. ఫరవాలేదు.' అన్నాడు కృష్ణ ఆమె నెలాగైనా సంతోషపెట్టాలనే ఉద్దేశంతో.

లలిత మనసులో ఏదో కలుక్కుమన్నది. చిన్నబుచ్చుకున్న మొహంతో ఆమె నీరసంగానవ్వి "అవును. నేనసలు లేకపోయినా ఫరవాలేదు మీకు !" అంది బాధగా.

నవ్వుతున్న కృష్ణ ఒక్కసారిగా నిర్ఘాంత పోయాడామెమాటలకు. అతనికి కొన్నాళ్ళబట్టి భార్య ప్రవర్తన బాధాకరంగానే ఉంటోంది. కాని "ఏమిటిది?" అని తను అడిగితే "ఏముంది?" అని ఆమెనించి ఎదురయ్యే ప్రశ్నకు ఏముందో నిరూపించ గల శక్తి లేదతనికి. ఏముందో ఆమెచెప్పదు. అక్కడేఉంది ఈ మనుషుల తెలివి! పోనీ ఏమీలేదని మనసుని హాయిగా, సంతోషంగా ఉంచుకోవటమూ సాధ్యం కావటంలేదతనికి. ఇదేదో అవ్యక్తమైన బాధగా, అర్థంకాని ఘర్షణగా, చెప్పరాని భారంగా అనిపిస్తోంది. అల్పసంఘటనల్లోని ఈ ఆవేదన బయటపెట్టేవిధమేది ? అడుగడుక్కీ బయటపడటం నాగరకత లక్షణం కాదుమరి!!



"ఎంచేతంటావు, లావుపాటివాళ్లు ఎప్పుడూ శాంతంగానూ మంచిగానూ ఉంటారు ?"
"ఉండక ! మేం పోట్లాడనూలేము, పరిగెత్తనూ లేము."

అందుకే అతను భార్య నేమనీ మందలించలేకుండా ఉన్నాడు. ఆమెని కోపించలేని అతని అశక్తత విషాదంగా మారింది.

బాధగా నిట్టూర్చి కృష్ణ అన్నాడు. 'నువ్వెలాగైనా మునుపటి లలితవు కాదు లలితా.'

లలిత ఆమాట సహించలేకపోయింది. ఇంతవరకూ తను ఎంత సహించిందో, ఎన్నిటికి మాట్లాడకుండా ఊరుకుందో అవన్నీ నిరూపించ లేనివి. అతను చేసేపనులన్నిటికీ మాట్లాడ

కుండా ఉన్నంతకాలం తను మంచిదే అయింది. కాని అది అతన్ని మార్చ లేనిమంచితనం! తనని బాధపెట్టేమంచి తనం! దానివల్లఅతనేమైనా మారాడా? పైపెచ్చు తన సినిమాలూ, సరదాలు, స్నేహితులతో విజృంభించాడు. ఇప్పుడుతను 'నువ్విలాచేస్తున్నావు!' అని చెప్పదలచుకున్నందుకు మునుపటి లలిత కాకుండా పోయింది. ఛీ! ఏం మగవాళ్లు!! వాళ్లుచేసేలోపాలు సహిం చినంతకాలం ఎదుటివాళ్ళు—అందులో ముఖ్యంగా భార్యలు మంచివాళ్లు. ఎప్పుడైనా విసిగి 'మేమూ మనుషు లమే! మాకు మనసుంది!' అని తెలియ చెప్పబోతే, లోపాలు తెలుసుకోలేరు సరికదా, ఎదుటివాళ్ళ నిట్టే చెడ్డ వాళ్ళని చేసేస్తారు. ఇటువంటి మనుషు లతో మనుగడలు శాంతిగా జరగాలను కుంటే మాత్రం జరిగే విధమేది ?

కృష్ణ అన్నమాటకి కోపంతో 'మీరూ ఉత్తరాలలో కనిపించిన మనిషి కాదు. అదితెలుసుకోండి?' అనేసి వంట గది లోకి వెళ్లిపోయింది లలిత.

కృష్ణ కాశ్చర్యం కలిగింది. ఇదే మిటి? తను ఉత్తరాలలో కనిపించిన కృష్ణకాడా? తను కేవలం కబుర్ల రాయుడనా ఆమె ఉద్దేశం? ఇంత వరకూ తనపై అవధుల్లేని ప్రేమపెంచు కుందని భావించిన భార్య ఇలా ఆరో పిస్తోందేమి టివాళ?

కూర్చున్న చోటినుంచి చటుక్కున లేచి వెళ్ళి 'లలితా' అని పిల్చాడు కృష్ణ.

వంటింట్లో స్పూన్స్ తుడిచి పడే స్తున్న లలిత కళ్ళెత్తి ఏమిటన్నట్లు చూసింది.

"మాట!"

"చెప్పండి!"

'ఇటురా !'

'చెప్పండి. ఫరవాలేదు, వినిపి స్తుంది !' అందామె అడుగు ముందుకి కదపకుండా.

వంటయింటి గుమ్మం పట్టుకు నుంచుని 'నామీద కోపంగా ఉందెం దుకు నీకు ?' అని అడిగాడు కృష్ణ.

ఇన్నాళ్లనుంచీ అటువంటి ప్రశ్న కోసం ఎదురుచూసిన లలిత కివాళ అందులో నవ్యత నశించింది. ఆమె నిర్లిప్తంగా 'కోపందేనికి ?' అని అడిగింది.

'చెప్పవా ?'

'ఏమీలేనిది ఏంచెప్పమంటారు ?'— సమయంవస్తే భర్తని నాలుగూ ఝాడించాలనుకున్న లలితకు తీరా ఆ సమయం ఆసన్నమవుతే అడగదలచు కున్నవాటిలో ఏ ఒక్కటీ గుర్తుకి రాలేదు.

'కాని నాలో ఏమైనా లోపా లున్నాయనిపిస్తే చెప్పు లలితా దిద్దు కుంటాను;' అన్నాడు కృష్ణ చాల బాధగా.

లలిత కాస్సేపు మాట్లాడకుండా ఊరుకుని 'మంచిరోజు ఎప్పుడు?' అని అడిగింది.

'ఎందుకు?'

'ఊరికి వెళ్లటానికి!'

కృష్ణ మొహం మ్లానమైపోయింది. అతను బాధగా 'ఏమో తెలీదు. కను క్కుంటాను.' అన్నాడు మెల్లిగా.

* * *

ఆఫీసులో కూర్చున్న కృష్ణకు ఒక్కొక్క గంట గడచినకొద్దీ బాధ అధికం కాసాగింది. అతను మాటి మాటికీ 'లలిత రాత్రికి వెళ్తోంది;' అనుకోసాగాడు.

అతనికి భార్య ఊరికి వెళ్తే బాధ లేదుకాని, ఆమె తనమీద కోపంతో, ఏదో బాధ మనసులో దాచుకుని, తనని కొన్నాళ్లపాటు తప్పించుకునే ఉద్దేశంతో వెళ్తానంటోంది. తను ఏం పొరపాటు చేశాడో, ఆమె కెందు కంత కోపంగా ఉందో ఎంత ఆలో చించినా తోచటంలే దతనికి. పోనీ లలితఅయినా చెబుతుం దనుకుంటే 'ఏముంది? ఏమీలేదు!' అనే ఆమె జవాబు.



"ఈ ఊళ్లో సీతారాములవారి ఆలయానికి దారి చెబుతావా బాబూ?"

"చూశారూ! పంకజాక్షీ! ఆ ఇంటికి సరిగ్గా ఎదురుగా ఉంది!"

సాయంకాలమైంది. ఆఫీసులో అందరూ ఇళ్లకు బయల్దేరుతూ ఉంటే కృష్ణ ఇంకా అక్కడే అన్యమన స్కంగా కూర్చున్నాడు.

'సార్;'

రంగనాథాన్ని చూసి కృష్ణ ఉలిక్కి పడ్డాడు.

'ఆరింటికి రమ్మన్నారు?' అన్నాడు రంగనాథన్ ప్రశ్నార్థకంగా.

'అవును. పద. ఇవాళ అమ్మగారు ఊరికివెళ్తోంది. కొంచెం నువ్వు సాయం చేయాలి. పద!' అంటూ కృష్ణ కుర్చీ లోంచి లేచాడు.

అతని హృదయం బాధతో మూలి గింది.

* * *

పొద్దున నిద్రలేచి నప్పటినుంచీ 'అబ్బ! ఇవాళ ఊరికివెళ్లి పోతాను. కొన్నాళ్ళపాటు హాయిగా ఉండి వస్తాను!' అను కుంటున్న లలితకు గంటలు గడిచిన కొద్దీ ఆ ఊహ లో హాయి క్రమ క్రమంగా తరిగిపోతూ కన్పించింది.

తను అన్నయ్య దగ్గరకు వెళ్ళాక భర్త ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు రాయకూడదు. తనూ చదువుకుంది. తనకీ ఒక విలువంటూ ఉన్నది. అది గుర్తించకుండా తేరగా ఓ మంగళ సూత్రం కట్టిన భాగ్యానికి తనచేత వెట్టి చాకిరి చేయించుకుంటా డాతను? అతని మనసు బాధపడుతుం దేమోనని ఎంతమందిని పిలుచుకువస్తే అంతమం దికీ వేళ కాని వేళల్లో అయినాసరే తను వండిపెట్టటానికీ వెనుకాడలేదు. అలా తను చేస్తుందన్న కృతజ్ఞత ఏమైనా ఆ మనిషికుందా? చేసినపనికీ కృతజ్ఞతా లేదు. చెయ్యని దానికి కోపమూ లేదు. భార్యనికూడా అందరితోపాటే పరిగ ణించే అతనికి తన సర్వస్వమూ అర్పించు కోవటంలో అర్థంతోచలేదు లలితకి.

ఆలోచనల తీవ్రతలో 'అసలింక ఇక్కడికి రాను!' అనుకుంది లలిత.

కాని తనూ ఒక స్త్రీ! తన హృద యమూ బ్రతుకులో సారాన్ని, పురు షుడిలో రసికతను కాంక్షిస్తుంది. ఇప్పు డొకవేళ అతనినుంచి దూరమవుతే మాత్రం తనకి మిగిలే దేమిటి? 'భర్త నొదిలింది!' అనే మాసిపోని మహా బిరుదూ, ఎక్కడో తనకీ భర్త ఉన్నా డనే మరువలేని దారుణ సత్యమూ తప్ప!!

చిన్నప్పుడు శరత్ "శేషప్రశ్న" చదివి 'జీవితానికి వివాహమే తుది గమ్యం అని ఎందుకు భావించాలి? అది విచ్ఛిన్న మవుతే జీవితం అంతా నాశనమే అని ఎందుక భిప్రాయ పడాలి?' అని వితర్కించుకుని, ఒక వేళ వివాహ విచ్ఛిత్తి జరిగినా వ్యక్తి జీవితంలో పురోగమించ వచ్చునని భావించేది తను!

కాని ఇవాళ ఆ కమలసిద్ధాంతాల్ని, తన ఊహల్ని ఆచరణ పూర్వకంగా భావించబోతే జీవితం భవితవ్యమంతా బీటలు వారిన ఊసర భూమిలా, హద్దులు తేలనివి ఎటో ఎటో పరచుకొంటోంది భయంకరంగా.


వివాహం తను ఊహించిన దివ్య సుందర సుఖాలు ఇవ్వలేదని దానిని రద్దుచేసుకోవటం తనకు సాధ్యమా? ఒక వేళ అలా చేస్తే మాత్రం ఆ అనుభ వాన్ని, ఆ స్మృతిని మనసులోంచి సమూలంగా తీసివేయగలదా తను? తను M.A. చదవొచ్చు. ఉద్యోగం చేయవచ్చు. కాని అజన్మాంతం, అను

క్షణం హృదంతరాలలో మసలే భర్త అనే పదాన్ని, ఆ మూర్తిని విస్మరించ లేదు. అది ఒదులుకోవాలంటే ఒదలని బంధం !! జన్మాంతరానుబంధం !

అదీకాక, తను ఉంటేనే ఇల్లు పట్ట కుండా తిరుగుతా డతను. ఇక తను లేకపోతే ఇంటి మొహం చూస్తాడా? వేళకి తిండీ, నిద్రాలేక, ఊరివారి ఉద్ధరణకు బయలుదేరే ఈ వ్యక్తి కోసం తను లేకపోతే ఇక ఎదురుచూసి, కావాలని పెట్టేవా ళ్ళెవరుంటారు? తను దగ్గరఉండి అన్నీ చూస్తూ ఉంటే అలా మనిషిలా ఉన్నాడుకాని లేక పోతే—చలివేస్తే దుప్పటితీసి కప్పుకో లేని మనిషి—

లలిత కీ ఊహతో భర్తమీద ఎక్కడ లేని జాలీ కలిగింది. తనభర్త అమాయ కుడు. అలాటి అతన్నొదిలి తను ఇప్పు డెందుకు వెళ్తున్నట్లు? అతనిపై తన అభియోగాలేమిటి? ఇంటికాలస్యంగా రావటం! తనకోపం గుర్తించక పోవటం!! ఇవేగా!

లలితకి చాలా సిగ్గనిపించింది. ఇంత చిన్న కారణాలతో తనతన్ని ఒదిలేసి వస్తుందా? ఇంటికాలస్యంగా రావటం అదొక తప్పా? నలుగురిలో తిరగ నేర్చిన వాళ్లు ఒకరోజు ఆలస్యంగా రాక, తొందరగా రాక ఎలా వీలు పడుతుంది? ఇక తన కోపం సంగతి




అతనడగలేదనటానికీ—అసలు తనకి కోపం రాదనే అతని ఊహ అవుతే ఎలా అడుగుతాడా మాట!! తనపై ఇంత సదభిప్రాయం పెంచుకున్న అతన్ని ఎంత బాధిస్తోంది తను!!

లలిత కీ ఊహాలతో అవమానకర మైన లజ్జ కలిగింది. సర్దుతున్న బట్టల నక్కడే ఒదిలేసి ఆమె గబగబవెళ్లి 'నేను వెళ్లను వెళ్లను!' అనుకుంటూ మంచంమీద పడుకుంది.

* * *

రంగనాథాన్ని తీసుకుని కృష్ణ యింటికి వచ్చేసరికి లలిత ప్రయాణ సన్నాహంలో లేకుండా. జుట్టు ముడి పెట్టేసి, యాదాలాపంగా వంటచేస్తూ కూర్చుంది.

"ఇదేమిటి లలితా! ఊరికి వెళ్తా నన్నావుగా" ఆశ్చర్యంతో అడిగాడు కృష్ణ.

'నే నేం వెళ్తాననలేదు! ఇవాళ నేను వెళ్లను" అంది లలిత, ఒకసారి అటూ-

ఇటూచూసి, చప్పున అతని గుండెల మీద తలవాల్చేసి, "చెప్పండి-నేను వెళ్లిపోవాలనిఉందా మీకు?" అంటూ ఏడవసాగింది నిశ్శబ్దంగా.

కృష్ణ విస్తుపోయాడు. అతని హృదయం ద్రవించి పోయింది.

"ఛ. ఇదేమిటి? నువ్వువెళ్తానంటే వెళ్లమన్నాను".

అవును నే నెందుకు వెళ్తానన్నాను? నామనసు మీరా మాత్రం గుర్తించ లేరా? మీకోసం నే నెన్నిచేస్తున్నాను? కాని మీరేమీ గుర్తించరు. మీరు సంతోషంగా, సరదాగా ఉంటే నే చాలనుకుంటాను నేను. కాని మీరు అలాచేయడం నావిధి అన్నట్లుగా చూస్తారు నన్ను. నాకుమాత్రం మనసు లేదా? నేను మాత్రం మనిషినికానా? మీ నిర్లక్ష్యాన్ని నే నెలా భరించగలను చెప్పండి!' అంది లలిత గుక్కతిప్పు కోకుండా.

"ఏడవకు" అభియోగం విచారించే ముందు భార్యని లాలించాడు కృష్ణ ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

'ఎంతసేపూ మీ స్నేహితులతో తిరిగి తిరిగి అర్ధరాత్రి వస్తారింటికి. ఇంట్లో ఒక్కత్తినీ ఏమైపోతానన్నైనా లేదు మీకు. మీకోసం రాత్రులెంతసేపు కని పెట్టుకుని ఉన్నా మీ కా ధ్యాసే ఉండదు. చెప్పండి! మీకు నామీద ప్రేమఉందా? ఉంటే ఇట్లా ఎందుకు చేస్తున్నారు చెప్పండి?' అంది లలిత గాద్గదికంగా.

'లలితా!'

లలిత వినిపించుకోలే దతనిపిలుపుని. ఆవేశంగా ఇంకా చెప్పుకుపోతోంది. 'పోనీ మీకు ఇంకొకరి మనసు తెలుసు కునే శక్తి లేదనుకుందా మంటే నా విషయంలో తప్ప, అందరి విషయం లోనూ మీకు అన్ని మెళుకువలూ ఉన్నాయి! ఒక్కసారైనా నేను చేసిన పని ఒకటి "ఇది చాలా బావుంది లలితా" అని కాని 'నాకోసం ఇంత శ్రమ పడ్డావా?' అని కాని అంటారేమో నని ఎంత ఎదురుచూసేదాన్ని! ఒక్క నాడైనా వినలేకపోయాను! పైగా ఊళ్లో ఇరవై నాలుగ్గంటలూ తిరిగే ఓపికఉంది కాని, నాతో క్షణం విశ్రాం తిగా మాట్లాడే తీరిక లేదుమీకు! ఇంక ఏమనుకోను మిమ్మల్ని గురించి!! చెప్పండి నిజంగామీరు నన్ను ప్రేమిస్తు న్నారా?'

ఆమె మాటలన్నీ విని కృష్ణ సాలో చనగా 'క్షమించు లలితా నువ్వుచదువు కున్నదానివి. ఇలాటి వంతగా పట్టించు కోవనుకున్నాను. ప్రేమ మనసులో ఉండాలి కాని బయటికి కబుర్లు చెబుతే ఒరిగేదేమి టనుకున్నాను.' అన్నాడు.

లలిత ఆవేశంగా 'ఎందుకు పట్టించు

కోనసుకున్నా రివన్నీ? చదువుకున్నా నే నాడదాన్నే! నాకు నా భర్తనన్ను ప్రేమించాలనీ, ప్రశంసించాలనీ, ప్రశంసా వాక్యాలతని ముఖతః వినా లనీ ఉంటుంది. కాని మీ కెంతసేపూ మీస్నేహితులూ, మీ తిరుగుళ్లే నా సంగతి పడుతుందా?' అంది.

స్నేహపూర్వకంగా ఆమెని దగ్గరకు తీసుకుంటూ 'ఇంత ఆలోచన లేని దానివే లలితా నువ్వు? పెళ్లైనా ఒకరి కొకరం బందీలమయి పోవలసిన అవసరం లేదనే నా ఉద్దేశం! అందుకే నా పూర్వపు సరదాలింకా ఒదల్లేక పోయాను. నువ్వూ నీ ఫ్రెండ్స్‌తో తిరిగినా నా కభ్యంతరముండేదికాదు, నన్నర్థం చేసుకోలేవా లలితా?' అన్నాడు కృష్ణ అనునయంగా.

పెళ్లైనంతమాత్రాన ఒకరికొకరం బందీలం అయి పోనక్కర్లేదు మీరనుకున్నారేమో కాని నాకు నేనై మీకు బందీనయిపోతాను. నాకదే ఆనందం! నాకే ఫ్రెండ్స్ అక్కర్లేదు!' అంది లలిత.

దీని కింత బాధపడాలా లలితా?' నాతప్పేమిటి?ఎందుకు నీకంతకోపం?' అని అడిగినప్పుడైనా చెప్పకూడదా నాకు? నీకు తెలియదు లలితా నీ మీద నేనెంతగా ఆధారపడి ఉన్నానో నీకు తెలియదు. నిశ్చితమైన నిధిలా నీ ప్రేమ నాకుందను కున్నాన్నాళ్లూ నేను ఫ్రెండ్స్‌లో చాలా సరదాగా తిరగగలిగాను. కాని ఈమధ్య వచ్చిన స్పర్ధలతో మనసు వికలమై ఎక్కడ తిరిగినా, ఏంచేసినా 'లలిత ఎందుకిలా అయిపోతోంది?' అని ఇదేనావ్యథ! ఇదే ఆలోచన! ఆఖరికి నే నేమాట అన్నా తప్పుగానే తోచిందినీకు!'ఊరికి వెళ్లు!' 'అంటే కోపం 'ఒద్దు!' అంటే కోపం! 'ఎలా చెప్పునీతో?'

బాధంతా అపనయించిన స్నేహాలతో, ప్రేమగా అతని షర్టు గుండీలు సవరిస్తూ మెల్లగా నవ్వింది లలిత 'మీకు తెలియదండీ. స్త్రీహృదయం మీకు తెలియదు. తనపై భర్తకే ప్రేమ ఉందని విశ్వసించేస్త్రీ తను అడిగింది భర్త కాదంటే బాధపడుతుంది. తనపై ప్రేమలేదనుకునేస్త్రీ, తను అడిగింది భర్త సరే అంటే బాధపడుతుంది. మీకేం తెలుసు ఆడదానిమనసు?' అంది సవాల్ చేస్తున్నట్లు.

'నిజం! ఇంతవఱకూ తెలియలేదు. ఇంకనుంచీ తెలుసుకుని మసలుకుంటాను! అన్నాడు కృష్ణ నవ్వుతూ.

వెన్నెలనుగప్పిన వెతల మబ్బులు విడిపోయాయి.

వెన్నెల కిరణాలతో కలిసి, కమ్మని చల్లనిగాలులు లోపలికి మంద మందంగా వచ్చితాకుతున్నాయి...★